# మణి మనసు

''కుక్కముండా! అమ్మ తింటావులే?'' అంటూ మణి వచ్చి దానిముందు కూచుంది. ఆ అయిదేళ్ళ పసిహృదయంలోనూ ఆ కుక్కపట్ల ఎక్కడలేని ప్రేమాను. దానితోటే తిరుగుతుంది. దానితోటే ఆడుతుంది. తెల్లారితే మణికి కుక్కతోడిదే లోకం. కుక్కకూడా అంతే! మణిముందు కూచుని 'కుయ్‌కుయ్' లాడుతూ, ఆ చిన్నపిల్ల అంటూన్న మాటలు పెద్ద అర్థం అవుతున్నట్లు చెవులు ఆడిస్తూ ఆమెకేసే చూస్తూ ఉంటుంది.

వీధిగేటు కాస్త చప్పుడైతే చాలు - అరుచుకుంటూ పరిగెడుతుంది. పాత వాళ్ళూ తెలిసినవాళ్లూ అయితే, ఎదుర వెళ్ళినదల్లా మళ్ళీ వాళ్ళతోపాటే లోపలికి వస్తుంది, తోకాడించుకుంటూ. కొత్తవాళ్ళయితే అరిచి అరిచి వాళ్ళని హడలగొట్టి పారేస్తుంది.

దానికి హుషారువస్తే ఆ యింటి మెట్లన్నీ గబగబా ఎక్కేస్తూ దిగేస్తూ, అదో ఆటగా ఆడుతుంది. ఇల్లు ఎత్తులో ఉందేమో పది పదిహేను మెట్లు ఎక్కితేనే కాని అరుగు రాదు. ఆ అరుగు ఎక్కి ఠీవిగా తోకాడించుకుంటూ, ఈ ఇల్లంతా నాదే అన్నంత దర్జాగా చూస్తుంది చుట్టూ పల్లంగా ఉన్న పెరడుని. పెరట్లో ఉన్న పువ్వుల మొక్కలూ, కాయగూరల పాదులూ, నీడనిచ్చే చల్లని చెట్లూ అన్నీ భద్రంగా ఉన్నాయా లేవా అని పరీక్షించే ఇనస్పెక్టర్ చూపుల్లా ఉంటాయి దాని చూపులు అప్పుడప్పుడు.

దాన్ని కుక్కలా కాకుండా ఆ యింట్లో ఒక వ్యక్తిగా చూసేది మణి ఒక్కత్తే.

యజమాని రంగనాథ్‌కి ఆ కుక్కంటే విసుగూ అసహ్యమునూ. అతను చేసే ఎల్ డి సి. ఉద్యోగానికి హాయిగా ఇంటికివచ్చి ప్రశాంతంగా కూచోవాలని ఉంటుంది. మాటి మాటికీ కాళ్ళకి అడ్డాలుపడుతూ ఇంట్లో తిరుగుతూన్న ఆ కుక్కని చూస్తేనే చిరాకు అతనికి. మణికంటే పెద్దవాళ్లు, హైస్కూలుకి వెళ్ళే ఇద్దరు అన్నయ్యలూ, కాన్వెంటుకి వెళ్ళే ఇద్దరు అక్కయ్యలూ ఉన్నారు.

వాళ్ళకి కుక్కంటే చిరాకే!.... వాళ్ళలో వాళ్ళకి విసుగూ కోపం కష్టం ఏంవచ్చినా అవన్నీ ఆ కుక్క మీద చూపిస్తారు. పెద్దాడికి చిన్నాడిని తన్నాలనిపించినా, చిన్నాడికి పెద్దాడిని కొట్టాలనిపించినా ఇద్దరూ కుక్కనే బాదుతారు అల్లాగే మణి అక్కయ్యలూను. వాళ్ళమనస్సులో అసంతృప్తి కలగకనేపోవాలి కాని, ఏరకం అసంతృప్తి ఏర్పడినా, ఆ కుక్క యోగం మూడిందన్నమాటే!

ఇంక ఎటొచ్చీ- ఆ యింట్లో మణి తర్వాత కుక్కపట్ల కాస్త సానుభూతి కనబరచేది ఆ యింటి ఇల్లాలు సుబ్బలక్ష్మి. 'కుక్కంటే తనకేనా జాలి ఉంది! తనంటే ఈ ఇంట్లో ఎవరికుంది జాలి? పుట్టింటివారు ఎవరూ లేరు తనకి - చదువూ లేదు. అందువల్లే తన మాటకి ఈ ఇంట్లో విలువ లేదు. ఆ సంగతి తనకితెలుసు. అవమాన పరుస్తున్నా అలుసుగా చూస్తున్నా తను ఈ ఇంట్లోనే పడివుండాలి. వేరేదారి లేదు.' అందుకే సుబ్బలక్ష్మి ఆ యింటినే గుడ్డిగా నమ్ముకుంది. ఆ భర్తనే దైవంగా భావించుకుంది. రంగనాథంతో కాపురానికి వచ్చాక ఆమెకి సరదా అనేదే చచ్చిపోయింది. ఒక్కక్షణం విశ్రాంతిలేని బానిస ఆమె ఆ యింట్లో.

ఉదయం పనిమనిషి, తర్వాత వంటమనిషి, అందరూ అన్నాలు తిని వెళ్ళాక చాకలిమనిషి, ఆ తర్వాత పెరట్లో కూరగాయల పాదులూ చెట్లూ వాటి సంరక్షణ చూసే తోటమనిషీ ఇలా రోజు మొత్తంలో ఎన్నో అవతారాలెత్తుతూ, యంత్రంలా రోజు గడపడమే. రంగనాథంకాని, పిల్లలుకాని, ''అయ్యో, ఇంత కష్టపడుతున్నావా?'' అని ఆప్యాయంగా సుబ్బలక్ష్మిని ఎప్పుడూ పలకరించరు. పైగా అధికారం చూపడం, అసహ్యంగా చీదరించుకోవడం. ''ఆ కాఫీ ఇలా తగలెయ్యి.'' ''ఎక్కడ చచ్చావు?'' ''చెవుడా, అన్నం పెట్టమంటూంటే'' వంటి కర్కశమైన మాటలేకాని సౌమ్యమైన పలకరింపు రాదు ఎవరిదగ్గరనుంచీ. అసలామాటకొస్తే ఆ ఇంట్లో ఎవరితో ఎవరూ మాట్లాడుకోరు - పోట్లాడుకోవడమే గాని.

''నా నోట్సు కచేపించడం లేదు. నువ్వు తీశావేమిట్రా వెధవా?'' అంటాడు అన్నగారు.

''ప్రొద్దుటే వెధవా అంటావురా రాస్కెల్?'' అంటాడు తమ్ముడు.

''ఏరా, నేను రాస్కెల్‌నా?''

"ఏం.... నేను వెధవనా?"— ఇలా తగాదా తారస్థాయిని జేరుకునేసరికి, ఏ పెరట్లోనుంచో రంగనాథం రావడం, "వెధవల్లారా! తిన్నది అరక్క ఏడుస్తున్నారు. పొద్దున్నే దెబ్బలాట ఏవిటి?" అంటూ కొడుకులిద్దర్నీ చెరోదెబ్బా వెయ్యడం, తర్వాత సుబ్బలక్ష్మివైపు తిరిగి "వాళ్ళు కొట్టుకుంటూంటే ఊరుకుంటావేం?....నువ్వో మొద్దుమొహానివి" అంటూ పాతవీ కొత్తవీ కలిపి ఆమెని తిట్టడం - ఇదంతా ఆ ఇంట్లో రోజుకి ఒకసారయినా జరిగే ముచ్చట. సుబ్బలక్ష్మి పైటతో కన్నీళ్ళు తుడుచుకుంటూంటే, మణి బిక్కమొహంవేసుకుని చూస్తుంది. కుక్క కుయ్ కుయ్ మని అరుస్తుంది. రంగనాథం, అతని కొడుకులూ, "ఏమిటా అరుపులు?" అంటూ కుక్కని నాలుగు బాది, తమ కోపాల్నీ కక్షల్నీ తీర్చుకుంటారు. ఇది ఆ ఇంట్లో దినచర్య.

"కుక్కముండా! అమ్మ తింటావుటే?" అంటూమణి దానిముందు కూచుని అడుగుతోంది.

"అమ్మా, చూడవే! ప్రొద్దున్నే చెల్లాయి ఆ కుక్క దగ్గరికెళ్ళి కూచుంది'' అంటూ అరిచింది సుజాత.

"ఏవిటా అరుపులు? హోమ్‌వర్క్ చేసుకో. అరవకు. ఇక్కడ నేను పేపరు చదువుకుంటున్నాను'' అంటూ గయ్‌మన్నాడు రంగనాథం.

"అదికాదు నాన్నా! చెల్లాయి కుక్కని ముట్టుకుంటోంది" అంటూ మణి మీద ఫిర్యాదు చేసి, ఇందులో నా తప్పులేదన్నట్లు బిక్కమొహంతో చూసింది. దాంతో రంగనాథం కోపం మణివైపు తిరిగింది.

''ఓ మణిముండా! వీధిలో తిరిగే కుక్క అది. దాన్ని ముట్టుకుంటావేమిటే, లోపలికి పో.... ఊఁ.... పొమ్మంటూంటే!'' ఒక్క అరుపు అరిచాడు రంగనాథం.

ఆ అరుపుకి మణి ఉలిక్కిపడింది. వెంటనే ఉడుకుమోతుతనం వచ్చి కళ్ళురెండూ నీళ్ళతో నిండాయి. నాన్న ఎప్పుడూ ఇంతే! తిత్తుతాడు! 'నాన్నా, నీ జిత పచ్చి! అవ్వో! అవ్వో!' అంటూ వెక్కిరించి తుర్రున లోపలికి పరిగెట్టింది మణి.

మణి మాటలకి నవ్వు వచ్చింది రంగనాథానికి. నవ్వుకున్నాడు కూడా! అయితే, ఇంతలో మణిని కేకలేసినందుకు కాబోలు - జాలిగా కుయ్ కుయ్ మని అరిచింది కుక్క. దాంతో విసుగూ కోపం వచ్చాయి. అరిచినందుకు కుక్కని ఒక్క తాపు తన్నాడు. అది కుయ్యోమని ఏడ్చుకుంటూ వీధిలోకి పోయింది. తర్వాత రంగనాథానికి పేపరుమీద దృష్టి కుదరలేదు. ఎంతసేపటికీ చదివిందే చదువుతూ వచ్చాడు. దాంతో విసుగొచ్చి పేపరు అక్కడ పడేసి, "ఏమే! వంట అయిందా? నిన్నే!" అని ఒక్క అరుపు అరిచాడు.

"ఆ.... అయింది పిల్లల భోజనాలయ్యాయి మీరు లేస్తే వడ్డిస్తాను" అంది సుబ్బలక్ష్మి.

"వడ్డించు, తిని మళ్ళీ ఆరుమైళ్ళు సైకిలుతొక్కుకుని ఆఫీసుకు తగలడాలి."

"రోజూ ఇన్ని మైళ్ళు సైకిలుతొక్క శ్రమపడకపోతే ఆ ఊళ్ళోనే ఓ యిల్లు చూడకూడదూ?"

"ఆ.... మరే! నువ్వు చెప్పలేదనీ! ఓసి వెర్రి మొగమా! ఆ పట్నవాసంలో ఇంతమంది పిల్లలతో ఉండాలంటే నెలకి రెండు మూడు వందలు అప్పుచేయాలి. ఈ పల్లెటూళ్ళో కనుక పాతిక రూపాయలకి ఇంత ఇల్లు దొరికింది. సలహాలు కట్టిపెట్టి వెళ్ళి వడ్డించు." గయ్‌మన్నాడు రంగనాథం.

రంగనాథం లోపటికి వెళ్ళగా చూసి మణి బైటకి వచ్చింది. కుక్కకోసం చూస్తే అది అక్కడ కనిపించలేదు. మెట్లన్నీ దిగివెళ్ళి చూసింది. గేటుదగ్గర పడుకున్న కుక్క కళ్ళలోంచి నీరు కారుతోంది. మణి మనస్సు విలవిల్లాడింది. "నాన్న తిట్టారా? నేను కోప్పడతాలే!" అంది. వెంటనే కుక్క ముందుకాళ్ళతో కళ్ళుతుడుచుకుని తల ఊపింది. "నువ్వు ఇక్కడే ఉండు, నేను పెరుగూ అమ్మా తెస్తా" అంది మణి. కుక్క తోక ఆడించింది.

అన్నం తింటూతింటూ మధ్యలో ఆగి "ఎక్కడిది ఇది?" అన్నాడు రంగనాథం, అన్నంగిన్నెలో తెల్లగా మెరుస్తూన్న కొత్త గరిటెని చూసి. సుబ్బలక్ష్మి జవాబు చెప్పలేదు. "ఏం, మాట్లాడవేం?" గద్దించి మరీ అడిగాడు. సమాధానం చెప్పడానికి భయపడి పైటకొంగు మరింత పెద్దదిగా తీసుకొని, వంటినిండా కప్పుకొని అంటగిన్నెలు సవరించసాగింది సుబ్బలక్ష్మి.

"నా మాట వినిపిస్తోందా? డబ్బులు ఎక్కడివి?" పైకప్పు ప్రతిధ్వనించేలా అరిచాడు రంగనాథం

''అమ్మా! నాకు మజ్జిగా అన్నం కలుపు'' అంది మణి.

కూతురుకి అన్నంకలుపుతూనే ''మనింట్లోవే!'' అని నెమ్మదిగా జవాబు చెప్పింది సుబ్బలక్ష్మి. ఆమె ఆ మాటలు అంటూన్నప్పుడు బోనులో నిలబడి సంజాయిషీ ఇచ్చుకుంటూన్న ముద్దాయిలా ఉంది.

''ఇంట్లోవా? పర్సు ఎప్పుడూ ఇంట్లో ఉంచను. నెలసరిఖర్చు వద్దురాస్తాను. నాకు తెలియకుండా ఎక్కడొచ్చాయి నీకు డబ్బులు?'' సింహంలా గర్జించాడు రంగనాథం.

అమ్మని నాన్న ఎందుకు తిడుతున్నాడో మణికి అర్థం కాలేదు. కంచంలో మజ్జిగా అన్నం కుక్కకి పెట్టడంకోసం నెమ్మదిగా లేచి అక్కడనుంచి జారుకుంది.

"మాటకి సమాధానం చెప్తావా? కుక్కని తన్నినట్లు తన్నమంటావా?'' రంగనాథం అరుపు.

భయం భయంగా కనురెప్పలు మెల్లగాయెత్తి భర్తకేసి చూస్తూ, ' మన పెరట్లో పొట్లకాయలు చాలా కాస్తున్నాయి కదా? రోజూ అదేకూరా అని మీరు విసుక్కుంటున్నారు. అందుకని....'' ఆగింది సుబ్బలక్ష్మి.

''అందుకని?'' రెట్టించాడు రంగనాథం.

''అందుకని నాలుగు పొట్లకాయాలూ నాలుగురూపాయలకి అమ్మాను.''

''వాటితో ఈ గరిటె కొన్నావు....అవునా?''

''పాతగరిటె కాడవిరిగి, పులుసు కలియబెడుతూంటే చేతికి వేడి తగులుతోంది....''

''సుకుమారమైన చేతికి వేడితగలకుండా నాలుగు రూపాయలు తగలేసి కొత్త గరిటె కొన్నావు! బుద్ధిలేకపోతే సరి! ఆ నాలుగూ ఉంటే పిల్లాడికి నోట్సు వచ్చును.... ఎప్పుడూ ఇలాంటి తెలివితక్కువ పని చెయ్యకు'' అంటూ గబగబా చెయ్యి కడుక్కుని బట్టలు వేసుకుని సైకిలు తీశాడు రంగనాథం.

గేటుదగ్గర కుక్కకి అన్నంపెడుతోంది మణి.

రంగనాథానికి పళ్ళుమండుకొచ్చింది.

''మీరందరూ మింగడానికే తేలేక ఛస్తున్నాను. దీనికి మెక్కబెట్టడానికి కూడానా?" అంటూ సైకిల్ స్టాండ్ వేసి, మణి వీపుమీద ఒక్క చరుపు చరిచి, కుక్క డొక్కలో తగిలేలాగ ధన్‌మని ఒక్క తాపు తన్నాడు రంగనాథం.

మణి ఏడుస్తూ లోపలికి వెళ్ళిపోయింది. కుయ్ కుయ్‌మని అరుచుకుంటూ కుక్క వీధిలోకి పరిగెట్టింది.

కుక్కని తన్నాక ఏదో హాయిగా అనిపించింది రంగనాథానికి. విజిల్ వేసుకుంటూ బయలుదేరాడు.

రెండు వీధులు దాటేటప్పటికి, ఎవరో పద్దెనిమిదేళ్ళ అమ్మాయి తలఆర బెట్టుకుంటూ వీధిలో ఎవరితోనో మాట్లాడుతూ రంగనాథానికి కనిపించింది. ఇంత నిడుపాటి కురులున్న అమ్మాయిముఖం ఎంత చూడముచ్చటగా ఉంటుందో అనుకుంటూ ఆమె ముఖం చూసే ఉద్దేశంతో, సైకిలు తొక్కడం వేగం తగ్గించాడు. సైకిల్ మీంచి వెళుతూన్నదెవరా అని ఆ అమ్మాయి తలతిప్పి ఓరగా చూసింది. ఆ చూపులు వచ్చి రంగనాథం గుండెలకి సూటిగా తగిలాయి. గట్టిగా ఊపిరి పీల్చుతుని హుషారుగా విజిల్ వేసుకుంటూ 'ఎలాగైనా తలంటుకున్న ఆడపిల్లలో ఏదో కొత్త అందం వస్తుంది!' అనుకుంటూనే వేగంగా సైకిల్ తొక్కుకుంటూ వెళ్ళిపోయాడు రంగనాథం.

సుబ్బలక్ష్మికి ఆ వేళల్లా పని తోచలేదు. అన్నం సయించలేదు. కాపురానికి వచ్చి పదిహేనేళ్ళు దాటుతున్నా ఆ మనిషి దగ్గర్నుంచి ఒక అప్యాయమైన మాటకి కాని ఆదరణతో కూడిన పలుకుకి కాని తను నోచుకోలేదు. మాటలు రాకపోయినా మొక్కలు నయం. కంటికి ఇంపుగా పువ్వులు పూస్తాయి. కడుపు నింపుకోడానికి కాయలు కాస్తాయి. పలకరించలేదు కాని మనుష్యులకంటే చందమామ నయం. చల్లగా వెన్నెల కురిపిస్తాడు. మనస్సులో భావం చెప్పలేకపోయినా చెట్లమీద పక్షులు మనస్సుకి ఆనందాన్నిస్తాయి.

తండ్రిలాగే పిల్లలూను. అప్యాయంగా మాట్లాడ్డంగాని, ప్రేమగా పలకరించడంగాని ఏంలేదు. పెద్దపిల్లలు వాళ్ళలోవాళ్ళు కొట్టుకుంటారు. సందు దొరికితే చిన్నపిల్లల్ని ఏడిపిస్తారు. అందరికీ చంటిది మణి లోకువ. కారణం ఉన్నా లేకపోయినా దాన్ని తలొకరూ తలో దెబ్బ వేస్తారు. ఉక్రోషాలూ కోపాలూ తాపాలు వస్తే దెబ్బ లాడుకున్నంతసేపు దెబ్బలాడుకుని చివరికి అందరూ కలిసి ఆ కుక్కని తలో తాపూతన్ని, తమ ఆవేశాలు ఆవిధంగా తీర్చుకుంటారు.

"ఊరుకోండిరా పాపం, దాన్ని అలా తన్నకూడదు ఆ జీవుడు ఏడిస్తే ఆ ఉసురు మనకి తగులుతుంది" అంటూ తను ఏదైనా అనబోతే పిల్లలు నలుగురూ కలిసి తనమీదకి వస్తారు. ''ఒరేయ్, వేదాంతం చెబుతోందిరోయ్ మీ అమ్మోయ్!'' అని ఆయన విరగబడి నవ్వడం ఒకటి.

ఈ ఇంట్లో తన బ్రతుకూ ఆ కుక్క బ్రతుకూ ఒక రకంగానే ఉంది. అంతా హింసించేవాళ్ళే! ఒక్కళ్ళకీ ప్రేమ లేదు. ఏమైనా జాలిగుండె అంటూ ఉంటే మణికి ఒక్కదానికే! దానికి మాత్రమే తన పోలిక వచ్చింది. తక్కిన నలుగురూ తండ్రి పోలికే!

ఆ రోజల్లా సుబ్బలక్ష్మి మనస్సు అస్థిమితంగానే ఉంది.

తర్వాత నాలుగైదురోజులు గడిచిపోయాయి ...

ఆరోజు ఆదివారం కదా అని పిల్లలకి తల అంటి నీళ్ళు పోసింది సుబ్బ లక్ష్మి. చాలా రోజులైంది కదా అని ఆ చేత్తోనే తనుకూడా తలంటు పోసు కుంది. తలారపెట్టుకుంటూన్న భార్యని చూశాడు రంగనాథం. చూసి ఉగ్రుడై పోయాడు.

"ఇవాళ తలంటు పోసుకున్నావేం? కుంకుడుకాయల ఖరీదు ఎంత మండి పోతూందో తెలుసా? ఓ. అందరికీ కూడా పోశావే! నీకేం సంసారం పట్టినట్లు లేదు. చచ్చీచెడీ ఈ కుటుంబభారం నేను లాగుతూవుంటే నీకు షోకులా? ఏం, మాట్లాడవేం?'' అంటూ మీదమీదకి వచ్చి అక్కడితో అక్కసుతీరక మెట్ల దగ్గర పడుకుని ఉన్న కుక్కని ఒక్క తాపు తన్నాడు గట్టిగా.

అది బాధగా అరిచి కుంటుకుంటూ వీథిలోకి పోయింది.

రంగనాథం వెళ్ళి కుర్చీలో కూర్చుని డైలీ పేపరులో ఆదివారం అను బంధం తిరగేస్తున్నాడు.

సుబ్బలక్ష్మి పెరట్లో మొక్కలమధ్య తిరుగుతూ కూనిరాగం తీస్తూ తల ఆరబెట్టుకుంటోంది.

పేపరు చదవుతూన్నవాడల్లా రంగనాథం పరధ్యానంగా అటు చూశాడు.

నాలుగురోజులక్రితం తను చూసిన నిడుపాటికురుల అమ్మాయిలా కని పించింది సుబ్బలక్ష్మి. ఎవరో అమ్మాయి అనే భ్రమతో ఆశగా కుర్చీలోంచి లేవబోయాడు. కాని, సుబ్బలక్ష్మి ఇంతలో ఇటు తిరిగింది. వెంటనే రంగనాథం నిరాశగా కుర్చీలో కూలబడిపోయాడు.

కాని, అంతలోనే అతనికి అనిపించింది,

''ఛీ... ఏవిటి నా ఆలోచనలు? నా కోసం, ఈ ఇంటికోసం, పిల్లల కోసం కష్టపడి చాకిరీచేస్తూన్న నా ఇల్లాలు ఇది! దీన్ని కాదని ఎవరో దారిన కనిపించిన అమ్మాయికోసం మోజుపడ్డమా? అది ఎక్కువా? ఇంత శ్రమపడి ప్రేమతో ఇల్లు చక్కదిద్దుతూన్న భార్యని ఈసడించుకోవడమా? ప్రేమగా లాలనగా పలకరిస్తే ఎంత సంతోషిస్తుందీ! ......'

''సుబ్బులూ! సుబ్బలక్ష్మీ!'' అని అప్యాయంగా పిలుద్దాం అనుకున్నాడు రంగనాథం.

అనుకుని నెమ్మదిగా వెనకాలేవెళ్ళి ఆమె పైటకొంగు సుతారంగా లాగాడు. మొదట సుబ్బలక్ష్మి ఉలిక్కిపడింది. తర్వాత ఎప్పుడూలేంది ఈయనకి ఈ సరసం ఎలా వచ్చింది అని తెల్లబోయింది. తర్వాత ముసిముసి నవ్వులు నవ్వుతూ అనురాగంతో అతనికేసి చూసింది. ఆ చూపులకి రంగనాథం తబ్బిబ్బు పడిపోయాడు. సమయం మరిచిపోయి ఆమెని దగ్గరగా తీసుకోబోయాడు.

ఇంతలో మణి అక్కడికి వస్తూ "అమ్మా! కుక్క ముండ పొద్దుటినుంచీ రాలేదే" అంది.

'వస్తుందిలే, నువ్వు వెళ్ళి అక్షరాలు దిద్దుకో'' అంటూ మాటమార్చి భర్త సందిట్లోంచి నెమ్మదిగా తప్పుకుంది సుబ్బలక్ష్మి.

''నీకు కుక్క గురించితప్ప వేరే ధ్యాస లేదా? పోయి ఆడుకో'' అని కసురుకున్నాడు రంగనాథం.

తండ్రినీ తల్లిని మార్చి మార్చి చూసి ఇంట్లోకి వెళ్ళి పడుకుంది మణి.

''సాయంత్రం అయినా ఆ పడకేవిటే?!' అంటూ మణి వంటిమీద చెయ్యి వేసి లేపబోయిన సుబ్బలక్ష్మి కెవ్వన కేకేసింది.

వళ్ళు సలసల కాగిపోతోంది.

రాత్రిఅంతా జ్వరం ఫెళ్ళుమంటూ కాస్తూనే ఉంది తెల్లవారినా మణి కన్ను తెరవలేదు. సుబ్బలక్ష్మి, రంగనాథం సరే - పిల్లలు నలుగురూ కూడా ఆందోళనతో మణి మంచం చుట్టూ కూర్చున్నారు.

జ్వరంలో మణి పలవరించడం ప్రారంభించింది: "'కుక్కముండ వచ్చిందా అమ్మా? దానికి ఆకలేస్తే అమ్మ ఎవరు పెడతారు? జ్వరంవస్తే మందో? చలివేస్తే దానికి ఎవరు కప్పుతారు?"....

మణి పలవరింతలు వింటూంటే సుబ్బలక్ష్మికి కన్నీళ్ళు ఆగలేదు.

"వస్తుందిలేఅమ్మా... కుక్క వస్తుంది. నువ్వు ముందు జ్వరంతగ్గించుకో!" అంది.

'అందరూ దాన్ని కోపంతో అస్తమానూ తన్నుతూ ఉంటే ఎన్నాళ్ళు పడుతుంది? అందుకే వెళ్ళిపోయింది' అనుకుని కన్నీళ్ళు వత్తుకుంది సుబ్బలక్ష్మి.

ఇంకోరోజు గడిచింది.

మణి జ్వరం ఏమాత్రమూ తగ్గలేదు

దిక్కుపోయి ఎముకలు కనిపిస్తూ మంచానికి అంటుకుపోయి ఉంది మణి. మధ్యమధ్య కుక్కగురించి పలవరిస్తూనే ఉంది.

ఇన్నాళ్ళూ ఎవరికి కోపం వచ్చినా కుక్కమీద చూపించేవాళ్ళు. ఇప్పుడది లేకపోవడంతో, ఒకరిమీద ఒకరు కోపగించుకోవడం, అరుచుకోవడం, దెబ్బలాడుకోవడం ప్రారంభించారు. వాళ్ళ దెబ్బలాటచూసిరంగనాథం విసుక్కుని అందర్నీ తలొకకేకా వెయ్యడం-ఇల్లంతా రణగొణధ్వనిగా తయారయింది.

మణికి జ్వరంవచ్చి అప్పటికి నాలుగురోజులయింది. "పక్కింటి పిన్నిగారిని అడిగి మిరియాలు పట్టా" అని సుబ్బలక్ష్మి సుజాతని పంపింది. "మా మణికి జ్వరం వచ్చింది. కాసిన్ని మిరియాలు తెమ్మంది" అని సుజాత చెబుతూంటే ఆ యింటి గుమ్మంలో పడుకున్న కుక్క ఒక్కమాటు వళ్ళుదులుపుకొని లేచింది. మణి అంటే దానికి అర్థం అయింది కాబోలు, సుజాత వెనకాలే వచ్చింది. మంచానికి బల్లిలా అంటుకుపోయి పడుకున్న మణిని చూసి కుయ్ కుయ్‌మని అరుచుకుంటూ మంచం చుట్టూ తిరగసాగింది.

కుక్క అరుపు విని నీరసంగా కళ్ళు తెరిచింది మణి.

ఎదురుగుండా తోకఆడించుకుంటూ కుక్కముండ!

మణి కళ్ళల్లోకి వెలుగు వచ్చింది.

వంట్లోకి చెప్పలేనంత శక్తి వచ్చింది.

"వచ్చావా? ఎక్కడికీపోకూ....ఏం?" అంది.

కుక్క కాళ్ళుజాపుకుని అక్కడే పడుకుంది.

"నాకు జ్వరంతగ్గాక నీకు అమ్మ పెడతాలే!" అన్న మణి మాటలకి, కుక్క తలని కదుపుతూ చెవులు టపటప లాడించింది.

మర్నాడు మణికి జ్వరం తగ్గింది.

"అమ్మా, కుక్కముండ చూడవే - చిక్కిపోయింది" అంది మణి.

"జ్వరంవచ్చి నువ్వూ చిక్కిపోయావు అది కనిపించక" అంది సుబ్బలక్ష్మి.

"ఈ కుక్క మళ్ళీ వచ్చిందీ?" విసుక్కున్నాడు రంగనాథం.

"పోనీయండి-మనం తినగా కంచాల దగ్గర మిగిలిందేగా దానికి వేస్తూంట? ఆ మాత్రం భూతదయ లేకపోతే భగవంతుడు మెచ్చడు. ఎవరూ శాశ్వతం కాదు" అంది సుబ్బలక్ష్మి.

"ఊ....వేదాంతం బాగా ముదిరిందే!" అంటూ వెటకారంగా నవ్వి అక్కడి నుంచి అరుగుమీదకి వెళ్ళిపోయాడు రంగనాథం.

"ఏ రోజు కారోజు కంగారవుతోంది. ఇవాళ శలవు కదా! కృష్ణకి వెళ్ళి స్నానం చేసివస్తాను" అన్నాడు రంగనాథం భుజంమీద టవల్ నడ్డికి బిగించు కుంటూ.

"జాగ్రత్త లోతుకెళ్ళకండి. అందదు. మడుగులా ఉంది. ప్రవాహం లేదని ఇక్కడ కృష్ణకి ఎవరూ స్నానానికి వెళ్ళరు. మీరెందుకు వెళ్ళడం?" అంది సుబ్బలక్ష్మి.

"హూ! నాకు జాగ్రత్తలు నేర్పడం .... ఆంక్షలు వెయ్యడం!....సర్లే!" అంటూ రంగనాథం పెద్ద పెద్ద అంగలువేసుకుంటూ బయలుదేరాడు కృష్ణలో స్నానం చేసిరావడానికి. అతని వెనకాలే కుక్కకూడా బయలుదేరింది.

"ఫో....ఫోవే....నువ్వెందుకు?" అని విసుకున్నాడు రంగనాథం. అయినా అది మానలేదు. కూడా బయలుదేరింది. దారిలో కనిపించినవాళ్ళతో మాట్లాడుతూ రంగనాథం మధ్యలో నాలుగైదుచోట్ల ఆగాడు.కుక్కకూడా ఆగింది."నువ్వేమిటే కాళ్ళకి అడ్డాలు పడుతూను" అంటూ గట్టిగా అదిలించాడు. అది కృష్ణవైపు పరి గెట్టింది. కృష్ణ ఒడ్డు ఎక్కి నీళ్ళలోకి తేరిపార చూసింది. వెంటనే పరుగుపరుగున వెనక్కి వచ్చింది.

నదివైపున నడిచివెళుతూన్న రంగనాథం ముఖంలోకి చూస్తూ ఏక అరవడం మొదలెట్టింది.

రంగనాథం కృష్ణ ఒడ్డు చేరుకున్నాడు.

కుక్క కాళ్ళకి అడ్డం పడింది.

రంగనాథం ఒడ్డు దిగి నీళ్ళదగ్గరికి వెళుతున్నాడు.

పంచె పట్టుకుని వెనక్కిలాగింది కుక్క.

"ఏం, పొగరు ఎక్కువైంది! పంచె చిరిగితే చంపుతాను జాగ్రత్త!" అన్నాడు రంగనాథం గుడ్లు ఎర్రజేసి.

అరిచింది. కాళ్ళకి అడ్డంపడింది. 'కుయ్యో!'మంటూ ఆర్తితో మొరిగింది.... అది పడుతూన్న బాధా, చేస్తున్న హెచ్చరికా అర్థం చేసుకోలేదు రంగనాథం

నీళ్ళదగ్గరికి చేరుకున్నాడు.

ఇంకొక్కక్షణం అయితే ఛెంగున నీళ్ళలో ఉరికేవాడే!

కాని, అతనికంటే ముందు కుక్క ఒక్క గెంతు గెంతి నీళ్ళల్లోకి ఉరికింది. రంగనాథం ఉలిక్కిపడి వెనక్కి తగ్గాడు.

నదిలో పెద్ద చప్పుడైంది.

అంతవరకూ నీళ్ళలో దాగివున్న రెండుబారల మొసలి ఒక్కమారుగా పైకి లేచినప్పుడు అయిన చప్పుడది.

నల్లని మృత్యువు నోరుతెరిచింది ...

కుక్క గిలగిలా కొట్టుకొంది....

పెనుగులాటవల్ల నీళ్ళు కలగుండుపడుతున్నాయి. ఇటూ అటూ కదిలి పోతూ ఎగిరిపడుతూన్న నీళ్ళవెనక ఏం జరుగుతూందో అర్థం అయేసరికి, నీటిలో చప్పుడు ఆగిపోయింది. నిశ్శబ్దంగా మారిన నీటిమీద ఎర్రని నెత్తురుజాలు!

రంగనాథానికి కళ్ళు బైర్లుకమ్మాయి. గజగజ వణికిపోయాడు .... గుండె ఆగిపోయినవాడిలా స్థాణువులా నిలబడిపోయాడు.

పరుగుపరుగున రంగనాథం ఇంటికి వచ్చి, తనకి జరగబోయిన ప్రమాదం, మొసలినోట్లో కుక్క ఇరుక్కుపోయిన విషాదదృశ్యం వర్ణించి చెబుతూంటే సుబ్బలక్ష్మి, తమ సంసారాన్ని నిలబెట్టిన కుక్కకి ధారగా కారుతూన్న కన్నీటితో అశ్రుతర్పణం విడిచింది. జరిగిన సంగతి విన్న ఊళ్ళో జనం ఆశ్చర్యంగా ముక్కుమీద వేలేసుకున్నారు రంగనాథం కృష్ణ ఒడ్డున సిమెంటుతో ఒక కుక్క విగ్రహాన్ని ప్రతిష్టింపజేశాడు. ఏటా కాలభైరవ సంతర్పణా, ఆ రోజున ఊళ్ళో కుక్కలన్నింటికీ గారెలు వండించి పెట్టించి, అభిషేకం అంత హడావిడిగా చేస్తు న్నాడు మణిమాత్రం ఇవాళ్టికి "అమ్మా, కుక్క ఏదే?" అని అడుగుతూంటుంది.*

(ఆంధ్ర జ్యోతి '87 దీపావళి సంచిక)